క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

తిప్పర్తి : మండలంలోని ఇండ్లూరు గ్రామంలో ఆదివారం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రి వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ జక్కి వీరస్వామి, డా.శశిధర్, వైద్య బృందం డా.వెంకట్‌రెడ్డి, భరత్‌రెడ్డి, డా.ప్రఫుల్ కిలార్, డా.వెంకటేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నాగుల వంచ విజయలక్ష్మి లింగారావు పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

కనగల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని కనగల్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం ..కరీంనగర్ జిల్లా వీణవంక మండలం సల్లూరు ఇసుక రీచ్ నుంచి హైదరాబాద్‌లోని అంబర్‌పేటకు వేబిల్ అనుమతులు ఉండగా.. నల్లగొండ నుంచి కనగల్ వైపు వెళ్తున్న లారీని పోలీసులు ఆపి వే బిల్ పత్రాలను పరిశీలించారు. అనుమతి లేకుండా లారీ కనగల్ వైపు రావడంతో ఓనర్ సైదులు, డ్రైవర్ కరుణాకర్‌పై కేసు నమోదు చేసి లారీని సీజ్ చేసినట్లు తెలిపారు.

సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా శంకర్

మర్రిగూడ : మునుగోడు నియోజకవర్గ టీపీసీసీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా మర్రిగూడ మండలంలోని దామెరభీమనపల్లికి చెందిన జిల్లా శంకర్ ఎన్నికయ్యారు. ఆదివారం మునుగోడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో తనను ఎన్నుకున్నట్లు శంకర్ తెలిపారు. జిల్లా కోఆర్డినేటర్ రవి తనకు నియామకపత్రాన్ని అందజేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో చండూరు, మనుగోడు, నాంపల్లి, సంస్థాన్ నారాయణపురం, చౌటుప్పల్ మండలాల కోఆర్డినేటర్లు రాహుల్, చింటు, సైదయ్య, గణేశ్, జగన్, వెంకటనారి, వడ్డె విజయ్, ఇరిగి తిరుమల్, తిరుమణి గణేశ్, జిల్లా శివ, ఆకారపు శివ, కల్యాణ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మాలమహానాడు అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు



చిట్యాల: మున్సిపాలిటీలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన దాసరి వెంకటేష్ మాల మహానాడు చిట్యాల మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈమేరకు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

స్నేహితురాలి కుటుంబానికి చేయూత



నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కనగల్: మండల పరిధిలోని బోయినపల్లి గ్రామానికి చెందిన పరిపూర్ణ చారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. చిన్న వయసులో భర్తను కోల్పోయిన మంజులకు జి యడవల్లి ఉన్నత పాఠశాలలో ఆమెతోపాటు చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం రూ.40 వేలు అందజేసి మానవత్వం చాటుకున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

తిప్పర్తి: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని తిప్పర్తి మండల కేంద్రంలో ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ సాయిప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం కండ్లకుంటతండాకు చెందిన లావుడ్యా శ్రీను, లావుడ్యా సుధాకర్, లావుడ్యా నాగరాజు కలిసి మినీ గూడ్స్ వాహనంలో మిర్యాలగూడ నుంచి హైదరాబాద్‌కు 43 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా తిప్పర్తి మండల కేంద్రంలో పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

మర్రిగూడ : క్రైస్తవుల పర్వదినం క్రిస్మస్ పండుగ ముందు జరుపుకునే సెమీ క్రిస్మస్ వేడుకలను మండలంలోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యనిర్వాహక ఇంజనీర్ భూక్య రాములు, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ జె.ఖాసీం కేక్ కట్ చేసి పంపిణి చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



కేక్ తినిపించుకుంటున్న అధికారులు

నత్తనడకన నర్సరీల పనులు

- మర్రిగూడ మండలంలో 20 నర్సరీలు
- టార్గెట్ 2.13 లక్షల మొక్కల పెంపకం
- ఇంకా పూర్తికాని ప్యాకెట్లలో మట్టి నింపే పనులు
- పర్యవేక్షణ చేయడంలో అధికారుల నిర్లక్ష్యం



ఉపాధిహామీ కార్యాలయంలో ఉన్న కవర్ల బస్తాలు



రాజాపేటతండాలో ప్రారంభం కాని నర్సరీ పనులు

మర్రిగూడ : ప్రభుత్వం ప్రతి ఏటా గ్రామాల్లోని నర్సరీల్లో ఉపాధిహామీ పథకం ద్వారా మొక్కలు పెంచి గ్రామాల్లోని ఖాళీ ప్రదేశాల్లో, పొలం గట్లపైన, ప్రభుత్వ ప్రదేశాల్లో నాటిస్తోంది. గత ప్రభుత్వ ఈ కార్యక్రమానికి హరితహారం అని పేరు పెట్టి ప్రతి సంవత్సరం గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలతో మొక్కలు నాటించేది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఈ కార్యక్రమానికి వన మహోత్సవం అని నామకరణం చేసింది. మర్రిగూడ మండలంలోని 20 గ్రామపంచాయతీల్లో 20 నర్సరీల్లో 2025–26 ఆర్థిక సంవత్సరంలో 2.13 లక్షల మొక్కలను పెంచి సకాలంలో వాటిని నాటేందుకు ప్రణాళికలు రూపొందించారు. వీటి కోసం రూ.32 లక్షల కేటాయించారు. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా డిసెంబర్ చివరి వారం వచ్చేసరికి కూడా నర్సరీల్లో పనులు నత్తనడకన సాగుతున్నాయి. కనీసం ప్యాకెట్లలో మట్టిని నింపే పనులు పూర్తికాలేదు. మండలంలోని రాజాపేటతండా, వెంకేపల్లి గ్రామాల్లోని నర్సరీల్లో మట్టిని పోయించారు కానీ పనులు ప్రారంభించలేదు. మిగతా గ్రామాల్లో ప్యాకెట్లలో మట్టిని నింపే కార్యక్రమం చేపట్టినప్పటికీ పనుల్లో వేగం పెంచడం లేదు. మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో ఉన్న నర్సరీల్లో డిసెంబర్ చివరి నాటికి ప్యాకెట్లలో ఇప్పటికే మట్టిని నింపే కార్యక్రమం పూర్తి కావాలి. ఆ ప్యాకెట్లలో విత్తనాలు విత్తినట్లయితే జూన్‌లో వర్షాలు కురిసే నాటికి మొక్కలు అందుబాటులోకి వస్తాయి.

ఎరువు, ఇసుక, పౌడర్ కలపకుండానే..

నర్సరీల్లో పెంచే మొక్కలకు ఉపయోగించే ప్లాస్టిక్ కవర్లలో ఎర్ర మట్టిని ఉపయోగించాలి ఆ మట్టిని పూర్తిగా జల్లి పట్టి మొత్తగా ఉండేలా చూడాలి. దాంతోపాటు వర్మీ కంపోస్ట్ ఎరువు, ఇసుక, పురుగులు ఆశించకుండా పౌడర్ కలిపి ప్యాకెట్ నింపాల్సి నింపాలి. ఒక్కో కవర్ నింపినందుకు కూలీలకు రూ.1.30 చెల్లిస్తారు. సగటున ఒక కూలీ 230 బ్యాగులు నింపితే దినసరి వేతనం గిట్టుబాటు అవుతుంది. అయితే మండలంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో కవర్లలో మట్టిని నింపుతున్నారు కానీ.. ఎరువు, ఇసుక, పౌడర్ కలపడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు సరైన పర్యవేక్షణ చేయకపోవడంతో నర్సరీల్లో పనులు నత్తనడకన సాగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

మొక్కల రకాలు..నాటే ప్రదేశాలు

వేప, కానుగ, కుంకుడు, బాదం, గుల్మోర్, యూకలిప్టస్, టేకు, కరివేపాకు, జామ, తులసి, గులాబీ, మునగ, ఈత, ఖర్జూర, వెదురు, గోరింటాకు, మంచి తుమ్మ తదితర 50 రకాలకు పైగా మొక్కలను నర్సరీల్లో పెంచవచ్చు. నర్సరీలో పెంచిన మొక్కలను 20 శాతం రోడ్ల పక్కన, 20శాతం కమ్యూనిటీ ప్రభుత్వ స్థలాల్లో, 20 శాతం రైతుల పొలం గట్ల వెంట, 15 శాతం గ్రామాల్లోని ఇంటింటికి, 10 శాతం ఎక్సైజ్ శాఖ వారికి, 10శాతం బయోఫెన్సింగ్(ప్రభుత్వ స్థలాల చుట్టు), 5 శాతం చెరువుల వద్ద.. ఇలా మొక్కలను పంపిణీ చేయాల్సి ఉంటుంది. గతేడాది ఏపుగా పెరిగిన మొక్కలు లేకపోవడంతో హెచ్ఎండీఏ హైదరాబాద్ నుంచి మొక్కలను తీసుకొచ్చి నాటాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రైమరీ బెడ్లలో నాణ్యతా ప్రమాణాలు పాటించి సకాలంలో పనులను పూర్తి చేసి మొక్కలను సంరక్షించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మట్టితోపాటు ఎరువు నింపాలి



నర్సరీలో పెంచే మొక్కలు ఆరోగ్యంగా ఉండాలంటే మట్టితోపాటు ఎరువును కూడా నింపాలి. రోడ్డు వెంట ఎండిపోయిన మొక్కలను గుర్తించి వాటి స్థానంలో నూతన మొక్కలను నాటాలి. వాటికి రక్షణగా కంచెలను ఏర్పాటు చేయాలి.

–నక్క స్వామి, సరంపేట

ఈ నెల చివరి వరకు పూర్తి చేస్తాం

ఈ నెల చివరి వరకు ప్యాకెట్లలో మట్టిని నింపడంతోపాటు విత్తనాలను సేకరించి నాటడం పూర్తి చేస్తాం. జూలై, ఆగస్టు నెల వరకు మొక్కలను పంపిణీకి సిద్ధం చేస్తాం. అనుకున్న సమయానికల్లా మొక్కలను అందించేందుకు చర్యలు చేపడుతున్నాం.

–వివేక్, ఇన్‌చార్జ్ ఏపీఓ

వైద్యశాలను త్వరలో పూర్తి చేస్తాం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : పట్టణంలో 100 పడకల వైద్యశాలను త్వరలో పూర్తిచేసి ప్రారంభిస్తామని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. కేతేపల్లి, కట్టంగూర్ మండలాలకు మంజూరైన రెండు 108 అంబులెన్స్‌లను ఆదివారం నకిరేకల్ పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రతి మండలానికి ఒక 108 అంబులెన్స్‌ను అందుబాటులోకి తెచ్చారని గుర్తు చేశారు. గడిచిన పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో 108 అంబులెన్స్ సేవలను విస్మరించారని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మళ్లీ వాటిని పునరుద్ధరించే చర్యలు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ గుత్తా మంజులమాధవరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కోరారు. నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో ప్రాణదాతల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మేరుగుమల్ల రాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ గుత్తా మంజుల మాధవరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంటేశ్వరరావు, బీజీఆర్ ఫౌండేషన్ చైర్మన్ బచ్చుపల్లి గంగాధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం



మునుగోడులో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాల మహానాడు నాయకులు

మునుగోడు: డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా హేళన చేస్తూ మాట్లాడారని ఆరోపిస్తూ ఆదివారం మాల మహానాడు ఆధ్వర్యంలో మునుగోడు అంబేద్కర్ చౌరస్తాలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతకు ముందు మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ రావు వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు బోగరి విజయ్‌కుమార్, మండల అధ్యక్షుడు చలిచీమల యాదగిరి, మాల మహానాడు సంఘం నాయకులు ఈద శరత్‌బాబు, బెల్లం బాలశివరాజు, పెరమాండ్ల ప్రమోద్, జంగిలి నాగరాజు, రెడ్డిమల్ల యాదగిరి, వెంకట్, బేరి రవీందర్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- డీఎస్పీ శివరాంరెడ్డి
- నకిరేకల్‌లో అర్ధరాత్రి తరువాత తనిఖీలు
- 100 వాహనాలు సీజ్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నకిరేకల్ : గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి కోరారు. నకిరేకల్ పట్టణంలో శనివారం అర్ధరాత్రి తరువాత డీఎస్పీ శివరాంరెడ్డి ఆధ్వర్యంలో చబుత్ర కార్యక్రమంలో భాగంగా 100 మంది పోలీసులు తనిఖీలు నిర్వహించారు. వివరాలను ఆయన నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో వెల్లడించారు. నకిరేకల్ పట్టణంలో దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణా, సేవించే వారిని పట్టుకోవడానికి నార్కోటిక్ డ్రగ్ డాగ్‌తో తనిఖీ చేయించామన్నారు. వాహనదారులు నంబర్ ప్లేట్ లేకుండా అర్ధరాత్రి రోడ్లపై తిరుగుతున్నారని, దాదాపు 150 మందిని పట్టుకుని 100 వాహనాలు సీజ్ చేశామని తెలిపారు. 35 మంది డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డారని వివరించారు. పట్టుబడిని వారందరికీ స్థానిక పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చి ఆదివారం తెల్లవారుజామున 3గంటలకు వదిలేశామని తెలిపారు. వాహనదారులు సరైన పత్రాలు చూపిస్తే వదిలేస్తామన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిన వారిని మాత్రం వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చి కేసులు నమోదు చేస్తామని వివరించారు. తాము పట్టుకున్న వారిలో 25 ఏళ్ల లోపు వారే ఉన్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై నిఘా పెట్టాలని, తాగుడు, గంజాయి మత్తు పదార్థాలకు అలవాటు కాకుండా చూడాలని సూచించారు. చెడు అలవాట్లుకు లోనైతే డయల్ 100కు కాల్ చేస్తే పోలీసులు వచ్చి కౌన్సిలింగ్ ఇస్తారని తెలిపారు. ఈ తనిఖీల్లో నకిరేకల్, శాలిగౌరారం సీఐలు రాజశేఖర్, కొండల్‌రెడ్డి, ఆయా మండలాల ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వాలు

చండూరు(గట్టుప్పల్) : కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని సీపీఐ(ఎంఎల్) పార్టీ రాష్ట్ర కార్యదర్శి మేక వెంకటరామిరెడ్డి అన్నారు. ఆదివారం గట్టుప్పల్ మండల కేంద్రంలో వనం యాదయ్య అధ్యక్షతన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు వ్యతిరేక చట్టాలను వ్యతిరేకిస్తూ ఉద్యమాలు చేయాలన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి కోమటిరెడ్డి అనంతరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు పంగ రవి, వల్లూరి మల్లేష్, మాడుగుల దాసు, బొడ్డు అబ్బయ్య, మాడుగుల సత్తయ్య, బాలం యాదయ్య, కుండే సత్యనారాయణ, గడ్డం నరసింహ, కాస యాదగిరి, భీమగాని శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రచార పోస్టర్ విడుదల

నకిరేకల్ : జిల్లా కేంద్రంలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో జరగనున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర 6వ విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బక్క శ్రీనివాస్ కోరారు. మహాసభలకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను నకిరేకల్‌లోని సంఘం కార్యాలయంలో ఆదివారం ఆయన విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేషం, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎడ్ల సైదులు, నల్ల నర్సింహ, జిల్లా కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి, ప్రతినిధులు నలపరాజు వెంకన్న, గిరి యాదయ్య, పగిళ్ల సైదులు, కొమ్రరాజు సైదులు, యాదయ్య, శ్రీను, జయసాగర్, రవికుమార్, రఫీ, కిశోర్, చక్రపాణి, చంద్రశేఖర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

26న మండల పూజ

కట్టంగూర్: మండల కేంద్రంలోని శ్రీసాయి మణికంఠ ఆలయంలో ఈ నెల 26న నిర్వహించనున్న పంచమదశ మహా మండల పూజ మహోత్సవ ఆహ్వాన పత్రికను ఆలయ కమిటీ ప్రతినిధులు, ఉత్సవ నిర్వాహకులు ఆదివారం ఆలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి కొటారి సత్యనారాయణ, ఆలయ చైర్మన్ జిల్లా ముత్తి లింగయ్య, గుడిపాటి శివప్రసాద్, పోగుల నర్సింహ, అయ్యప్ప మాలధారులు గొరవని వెంకన్న, అంతటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



కేతేపల్లి: మాట్లాడుతున్న పోతెపాక లింగయ్య

కేతేపల్లి: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి నాయకుల, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతెపాక లింగయ్య కోరారు. ఆదివారం కేతేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పార్టీ బూత్ కమిటీ అధ్యక్షులను ఎన్నుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు రాచకొండ గోపి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకన్న, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సాయన్న, నాయకులు చినేని జానయ్య, ఎ.అనిత, గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, జి.కృష్ణ, పిట్టల వెంకట్, పద్మ, బొజ్జ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుల ఎన్నిక

చిట్యాల: మండలంలోని గుండ్రాంపల్లి గ్రామ పోలింగ్ బూత్ బీజేపీ కమిటీ అధ్యక్షులను ఆదివారం బీజేపీ మండల ఇన్‌చార్జ్ పీక వెంకన్న ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. 62వ పోలింగ్ బూత్ అధ్యక్షుడిగా సోమగోని నర్సింహ, 63వ పోలింగ్ బూత్ అధ్యక్షుడిగా రాచకొండ నరేష్, 64వ పోలింగ్ బూత్ అధ్యక్షుడిగా మైల పరమేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బొడిగె లక్ష్మయ్య, పెద్దగోని అంజన్, గరిషె నరేష్, పాపని వాసుదేవ్, రాచకొండ మల్లేష్, సిందం లింగస్వామి, నీల నర్సింహ, బుస్సు నర్సింహ పాల్గొన్నారు.

గడ్డం వెంకటస్వామికి నివాళి



కనగల్ : నివాళులర్పిస్తున్న అధికారులు

కనగల్: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం గడ్డం వెంకటస్వామి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి చిత్రపటానికి తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఆర్ఐ యాదగిరి, జూనియర్ అసిస్టెంట్ లతీఫ్, రికార్డు అసిస్టెంట్ రాంబాబు, అటెండర్ లక్ష్మయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరిముల్లా పాల్గొన్నారు.

మర్రిగూడ : మాజీ ఎంపీ జి.వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆదివారం మర్రిగూడ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీటీ జూటూరు తారక రామన్, సిబ్బంది ముత్తయ్య, మధు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

బస్ జాతాను విజయవంతం చేయాలి

నకిరేకల్ (శాలిగౌరారం): ఆశావర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25న నల్లగొండలో నిర్వహించే బస్‌జాతా, బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆశావర్కర్ల సంఘం మండల అధ్యక్షప్రధాన కార్యదర్శులు బల్లెం నవనీత, గుండ్ల సైదమ్మ కోరారు. శాలిగౌరారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆదివారం బస్‌జాతాకు సంబంధించిన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఆశా కార్యకర్తలకు బీమా సౌకర్యం ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు రేణుక, గుణవతి, ధనలక్ష్మి, జయమ్మ, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ మహోత్సవం



పూజలు నిర్వహిస్తున్న గురు స్వాములు

రామగిరి(నల్లగొండ): పట్టణంలోని పాతబస్తీ నెహ్రూ గంజ్‌లో మేడం విశ్వ ప్రసాద్, శ్యామ్ గురు స్వామి ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ముందడి సైదిరెడ్డి, వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత, మంచుకొండ శ్రీనివాస్, రమేష్, శంకర్, తేలుకుంట్ల శ్రీనివాస్, ఆలంపల్లి చంద్రశేఖర్, కంజర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీకృష్ణ వేషధారణ పోటీలు



పోటీలో పాల్గొన్న చిన్నారులు

ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా రామగిరిలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం శ్రీకృష్ణ వేషధారణ పోటీలు నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలో అలరించారు. గెలుపొందిన చిన్నారులకు శ్రీ భాష్యం జగన్నాథచార్యులు, వికాస తరంగిణి సభ్యులు ఈశ్వర్‌రెడ్డి, సుజాత, భారతి బహుమతులు అందజేశారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నల్లగొండ



బహుమతులతో చిన్నారులు

108 అంబులెన్స్ కేటాయింపు

సాక్షి ఎఫెక్ట్..

కేతేపల్లి: మండలంలో 108 అంబులెన్స్ వాహనం అందుబాటులో లేకపోవడంతో రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈనేపథ్యంలో 'సకాలంలో అందని 108 సేవలు'అనే శీర్షికన సాక్షి దినపత్రికలో ఇటీవల ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కేతేపల్లి మండలానికి ప్రత్యేకంగా 108 అంబులెన్స్ మంజూరు చేశారు. ఆదివారం నకిరేకల్‌లోని ఏరియా ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం కేతేపల్లికి కేటాయించిన 108 అంబులెన్స్‌ను ప్రారంభించారు. మరో ఒకటిరెండు రోజుల్లో కేతేపల్లిలో 108 అంబులెన్స్ సేవలు అందుబాటులోకి రానున్నట్లు తెలిసింది. విషయం తెలిసిన మండలంలోని ప్రజలుహర్షం వ్యక్తం చేస్తున్నారు. 'సాక్షి' కి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆర్థికసాయం అందజేత

నకిరేకల్ : మండలంలోని మంగళపల్లి గ్రామంలో ఇటీవల మృతిచెందిన జాల చిన్న మల్లయ్య కుటుంబానికి ఆదివారం బీజీఆర్ ఫౌండేషన్ చైర్మన్ బచ్చుపల్లి గంగాధర్‌రావు రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొడ్డేటి సైదులు, బొల్లెద్దు లక్ష్మయ్య, చింతల శ్రీను, పెరుమళ్ల నాగయ్య, కందికంటి పిచ్చయ్య, పూల శ్రీకాంత్, అంజయ్య, గుండాల సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు చర్చీలు ముస్తాబు

క్రిస్మస్ వేడుకలకు జిల్లా కేంద్రంలోని చర్చీలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. దుకాణాల్లో క్రిస్మస్ స్టార్స్, ట్రీలు, క్రిస్మస్ తాత బొమ్మలు, డెకరేషన్, లైటింగ్ సామగ్రి అమ్మకాలు సాగుతున్నాయి.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ



క్రిస్మస్ డెకరేషన్, లైటింగ్ సామగ్రి



విద్యుత్ దీపాలతో క్లాక్‌టవర్ సెంటర్‌లోని సెంటినరీ సెల్ఫ్ సపోర్టింగ్ తెలుగు బాప్టిస్టు చర్చి



మిషన్ కాంపౌండ్ చర్చి



మరియమాత దేవాలయం వద్ద ..



దుకాణంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న స్టార్స్